

వైఎస్సార్‌సీపీకి మళ్లీ అధికారం తథ్యం

వచ్చే ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ విజయం సాధించి మళ్లీ అధికారంలోకి వస్తుందని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. - 8లో..



వైద్య సదుపాయాల పటిష్టతకు రూపకల్పన

జిల్లా ఆస్పత్రిలో వైద్య సదుపాయాల పటిష్ట తకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వి.విజయరామరాజు తెలిపారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.7/18.1

జిల్లాలో మంగళవారం 18.1 - 34.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

శునకాలు పట్టేస్తున్నా.. కు.ని.కి పాటేనా!

- హైదరాబాద్‌లో ఇటీవల పట్టపగలు ఓ బాలుడిని వీధి కుక్కలు కరిచి చంపేశాయి. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ దృశ్యాన్ని చూసిన వారి హృదయం తరుక్కుపోయింది.
- విజయవాడలో మంగళవారం పాఠశాల నుంచి వస్తున్న ముగ్గురు చిన్నారులపై శునకాలు దాడి చేశాయి. స్థానికులు వాటిని తరిమివేయడంతో ప్రమాదం తప్పింది. అప్పటికే వారు ముగ్గురూ గాయాల పాలయ్యారు.
- ఇలా తరచూ ఏదో ఒక ప్రాంతంలో కుక్కలు బీభత్సం సృష్టిస్తున్నాయి. జిల్లాలోనూ చిన్న, చిన్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా పిల్లలపై విరుచుకుపడుతున్నాయి. దీంతో వారిని బయటకు పంపించాలంటే తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు.

- పేట్రేగుతున్న కుక్కలు
- చిన్నారులపై ప్రతాపం
- ప్రజలు బెంబేలు
- నియంత్రణ చర్యలు చేపట్టని అధికారులు



బద్వేలులో గుంపుగా సంచరిస్తున్న కుక్కలు (ఇన్‌సెట్) బద్వేలులో శునకం కాటుతో చిన్నారి సంధ్య గొంతుకు గాయమైన దృశ్యం

సాక్షి, నెట్‌వర్క్ : జిల్లాలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ప్రధాన కూడళ్లు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాలతోపాటు రోడ్ల వెంట గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు, పాదాచారులను వెంబడిస్తున్నాయి. చిక్కిన వారిపై దాడి చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయి. బాధితులు ఆస్పత్రుల పాలవుతున్నారు. కుక్కలను నియంత్రించాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ పేరుతో చేపట్టిన కార్యక్రమం కూడా ప్రహసనంగానే ముగిసింది. దీంతో కుక్కల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.

- వైఎస్ఆర్ జిల్లాలో కడప నగర పాలక సంస్థతో పాటు 6 పురపాలక సంఘాలు, 36 మండలాలు ఉన్నాయి. వాటిలో దాదాపు 25 వేల వరకు కుక్కలు ఉన్నట్లు అంచనా. ముఖ్యంగా పురపాలక సంఘాల్లోనే 15 వేలకు వరకు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. కడపలో 4 వేలు, ప్రొద్దుటూరు 3 వేలు, బద్వేలు 2 వేలు, మిగిలిన పురపాలక సంఘాల్లో సరాసరి 1500 వరకు ఉంటాయని అంటున్నారు.
- జిల్లాలో రోజూ కుక్క కాటు బాధితుల సంఖ్య 20 వరకు ఉంటోందని చెబుతున్నారు. నాటు వైద్యం, ఇంటి చికిత్స తీసుకున్న వారితో కలిపి లెక్కిస్తే 30కి పైగా ఉంటోందని అధికారులు చెప్పడం.. సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది. కడప నగర పాలక సంస్థ, పురపాలక సంఘాల్లోనే కుక్కల నియంత్రణ చర్యలు కనిపించడం లేదు. ఇక గ్రామీణ ప్రాంతాల పరిస్థితి మరీ దారుణంగా ఉంది.

అటకెక్కిన ఆపరేషన్ల వ్యవస్థ

కడప కార్పొరేషన్ : వీధి కుక్కల నియంత్రణ చేపట్టాల్సిన నగరపాలక సంస్థ ఆ విషయాన్నే పక్కన పెట్టేసింది. గతంలో మత్తు మందు ఇచ్చి పట్టుకుపోయి అడవుల్లో వదిలేసే వారు. అవి నాలుగైదు రోజులకు మళ్లీ శివారు ప్రాంతాలకు వచ్చి తిష్ట వేసేవి. నగరంలో పలువురిని కరిచి గాయాలపాలు చేసిన నేపథ్యంలో కొన్ని పిచ్చి కుక్కలకు ఇంజెక్షన్లు ఇచ్చి చంపారు. ఈ క్రమంలో ఒక పెంపుడు కుక్కను పట్టుకొని చంపేయడంతో నగర పాలక అధికారులపై కేసు నమోదైంది. ఆ సంఘటన తర్వాత తర్వాత కొన్ని మాసాల పాటు నగరపాలక అధికారులు కుక్కలను పట్టలేదు. నాలుగేళ్ల క్రితం కొత్త కంపోస్టు యార్డు వద్ద కుక్కలకు సంతానోత్పత్తి నియంత్రణ ఆపరేషన్ చేయడానికి ఏసీ థియేటర్ నిర్మించి తిరుపతికి చెందిన అనిమల్ కేర్ ల్యాండ్ అనే సంస్థకు అప్పగించారు. ఆ సంస్థ నగరంలో 1270 కుక్కలను పట్టుకొని, ఆపరేషన్లు చేసి జియో ట్యాగింగ్ చేసింది. వారి కాంట్రాక్టు గడువు తీరడంతో ఆ ప్రక్రియ పూర్తిగా ఆగిపోయింది. ఏడాది క్రితం కొన్ని కుక్కలకు పశుసంవర్థక శాఖ అధికారులు యాంటీ రేబిస్ టీకాలు వేశారు. కానీ పూర్తి స్థాయిలో వేయలేదు. దీంతో సమస్య షరామామూలే అన్నట్లుగా ఉంది. ఎక్కడైనా, ఎవరైనా ఫిర్యాదు చేస్తే అక్కడున్న కుక్కలకు మత్తు మందు ఇచ్చి కొండ ప్రాంతాల్లో వదిలేస్తున్నామని నగరపాలక అధికారులు చెబుతున్నారు. అది కూడా సక్రమంగా జరగడం లేదని నగరవాసులు ఆరోపిస్తున్నారు.

చికెన్, మటన్ వ్యర్థాలున్న చోట..

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు పట్టణంలో 1500 దాకా కుక్కలు ఉన్నాయి. పలగాడీ సెంటర్, నాగలకట్ట, భాగ్యనగర్‌లోని ఈద్గా వద్ద, ముద్దనూరు రోడ్డులోని బ్యాంక్ కాలనీ, క్యాంబెల్ ఆసుపత్రి, బీసీ కాలనీల్లో అధికంగా సంచరిస్తున్నాయి. చికెన్, మటన్ దుకాణాల యజమానులు వ్యర్థాలను వేస్తుండటంతో.. వాటి కోసం దుకాణాల వద్ద ఎక్కువగా తిరుగున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. వ్యర్థాలను పట్టణ శివారులో వేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

రాత్రి వేళలో ఒంటరిగా వెళ్లాలంటే..

బద్వేలు అర్బన్ : రాత్రి వేళలో ఒంటరిగా వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. పట్టణంలో 1500కు పైగా కుక్కలు సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. రాజుగారివీధి, అమ్మవారిశాలవీధి, గాండ్లవీధి, పూసలవాడలో కొంద రిపై దాడి చేశాయి. ఇటీవల కాలంలో మున్సిపల్ అధికారులు రెండు సార్లు వీధికుక్కల తరలింపు చేపట్టారు. సుమారు 200కు పైగా కుక్కలను నెల్లూరు ప్రాంతానికి చెందిన వారితో పట్టించి కడపకు తరలించారు. అక్కడ వాటికి పిల్లలు పుట్టకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించారు.



గాయపడిన సంధ్య (ఫైల్)

- బద్వేలులోని పూసలవాడలో గల ప్రాథమిక పాఠశాలలో పాదిలి సంధ్య అనే విద్యార్థిని 3వ తరగతి చదువుతోంది. 5 నెలల క్రితం రోజూ మాదిరే ఉదయం స్కూలుకు వెళుతున్న సమయంలో ఓ పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఈ ఘటనలో గొంతు కింద, దవడ భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వచ్చి కుక్కను తరిమివేయడంతో ప్రాణాపాయం తప్పింది.
- జమ్మలమడుగులోని భాగ్యనగర్‌లో ఈద్గా సమీపాన నెల క్రితం భాను అనే చిన్నారిపై కుక్క విరుచుకుపడింది. స్థానికులు గమనించి తరిమేశారు. అప్పటికే తీవ్ర గాయాల పాలైంది. బాధితురాలికి కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చికిత్స చేయించారు.



భాను కాలికి అయిన గాయం

ఒకే కుక్క 10 మందిని కరిచింది

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు పట్టణంలోని సంజీవనగర్, స్వరాజ్‌నగర్, ఏకేరోడ్డు, వసంతపేట, దస్తగిరిపేట, జిన్నారోడ్డు, ఆర్టీసీ బస్టాండు సమీపంలో, శ్రీనివాసనగర్‌తో పాటు మండలంలోని అమృతానగర్, ఈశ్వరరెడ్డినగర్, పెన్నానగర్, కొత్తపేట గ్రామాల్లో కుక్కల సంచారం ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతాల నుంచి కుక్క కాటు బాధితులు జిల్లా ఆస్పత్రికి అధికంగా వస్తున్నారు. ఇటీవల కొత్తపేట గ్రామంలో ఒకే కుక్క 10 మందిని కరచినట్లు ఆస్పత్రి అధికారులు తెలిపారు. రోజూ 30–35 మంది కుక్క కాటు బాధితులు సూది (ఏఆర్‌వీ) వేయించుకునేందుకు జిల్లా ఆస్పత్రికి వస్తున్నారు. జిల్లా ఆస్పత్రిలో గతేడాది నవంబర్ నెలలో 891, డిసెంబర్‌లో 1016, ఈ ఏడాది జనవరి నెలలో 1139 డోసుల ఏఆర్‌వీ ఇంజెక్షన్‌లు వేసినట్లు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు తెలిపారు. ఏఆర్‌వీ ఇంజెక్షన్‌లు కావాల్సినన్ని ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

అందుబాటులో యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు



కుక్క కాటు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కుక్కకు రేబిస్ ఉంటే.. కాటుకు గురైన వ్యక్తికి ఆ వ్యాధి రావడానికి ఆస్కారం ఉంటుంది. రేబిస్ వ్యాధి లక్షణాలలో నీళ్లు తాగాలన్నా, నీళ్ల శబ్దం విన్నా భయంగా ఉంటుంది. జ్వరం తదితర అనారోగ్య లక్షణాలు ఉంటాయి. కుక్క కరిచిన వెంటనే యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేయించుకోవాలి. కోర్సు మేరకు 5–7 వ్యాక్సిన్లు వేస్తారు. గతంలో ఈ వ్యాక్సిన్లు బొడ్డు చుట్టూ వేసేవారు. ఇప్పుడు భుజానికి వేస్తారు. పెంపుడు కుక్కలని నిర్లక్ష్యం చేయడం తగదు. ఈ కుక్కలకు టీకాలు వేయాలి. పెంపుడు కుక్క కరిచినపుడు మా ఇంటి కుక్కే కదా అని నిర్లక్ష్యంగా ఉండరాదు. రేబిస్ వ్యాక్సిన్లు వేయించుకోవాలి. అన్ని పీహెచ్‌సీల్లో ఈ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. ఉచితంగా పొందవచ్చు. – డాక్టర్ నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, కడప

ఆపరేషన్లు మళ్లీ మొదలు పెడతాం



కుక్కల పునరుత్పత్తిని అరికట్టేందుకు మళ్లీ ఆపరేషన్లు మొదలు పెట్టాలని యోచిస్తున్నాం. కుక్కల గురించి ఎక్కడైనా ఫిర్యాదులు వస్తే వెంటనే పట్టుకుంటున్నాం. పెంపుడు కుక్కలకు ట్యాగ్ కట్టుకోవాలి. యాంటీ రేబిస్ టీకాలు వేయించాలి. వీధుల్లోకి వదలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. – డాక్టర్ ప్రశాంత్ వర్ధన్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, కేఎంసీ

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం

మున్సిపాలిటీ పరిధిలో కుక్కలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. చంపివేయడం చట్టరీత్యా నేరం కావడంతో ఇటీవల 100 కుక్కలను పట్టుకుని వేరే ప్రాంతంలోని కొండల్లో వదిలి పెట్టాము.– జి.వెంకటరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, జమ్మలమడుగు

న్యూస్‌రీల్

11న ఎమ్మెల్సీ బ్యాలెట్ పేపర్ల పంపిణీ

కడప సిటీ : కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల బ్యాలెట్ పేపర్ల పంపిణీని ఈ నెల 11న చేపడతామని అనంతపురం జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన డీఆర్వోలు, నోడల్ ఆఫీసర్లతో ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కడప కలెక్టరేట్‌లోని బోర్డు హాలు వీసీ హాలు నుంచి డీఆర్వో గంగాధర్‌గౌడ్, బద్వేలు ఆర్డీఓ వెంకటరమణ, డీఆర్‌డీఏ, డ్వామా, మెప్మా పీడీలు ఆనంద్‌నాయక్, యదుభూషణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యార్డులో రెండో రోజూ కొనుగోళ్లు బంద్

కడప అగ్రికల్చర్: కడప వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పడిన శీతల గిడ్డంగి నిర్మాణ పనుల వివాదం కారణంగా రెండో రోజు కూడా కమీషన్ ఏజెంట్లు కొనుగోళ్లను బంద్ చేశారు. మార్కెట్‌యార్డు నిబంధనలకు విరుద్ధంగా పండ్ల వ్యాపారి చేపట్టిన శీతల గిడ్డంగి నిర్మాణ పనులను రెండవ రోజు కూడా కొనసాగించారు. కోర్టు ఉత్తర్వులతో పండ్లవ్యాపారి పనులను చేపట్టడంతో మార్కెట్ యార్డు సిబ్బంది ఎలాంటి చర్యలు చేపట్టలేకపోయారు. ఈ వివాదం విషయమై మంగళవారం ఆర్‌డీఓ ధర్మచంద్రారెడ్డి మార్కెట్ యార్డును సందర్శించి పరిశీలించారు. అనంతరం మార్కెట్‌యార్డు కార్యాలయంలో యార్డు డైరెక్టర్ బంగారు నాగయ్య, జేడీ రామాంజనేయులతో చర్చించారు. పండ్లవ్యాపారి కోర్టు ఉత్తర్వులు తెచ్చుకుని పనులను చేపట్టడంతో.. జాగ్రత్తగా కోర్టు ద్వారానే పనులను నిలిపివేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతోపాటు రైతులకు సంబంధించిన పంట ఉత్పత్తుల కొనుగోలుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు.

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

రాయచోటి అర్బన్ : దేశంలోని నిర్మాణాలు, పట్టణాల పేర్లను మార్చాలంటూ బీజేపీ నేత అశ్వనీ కుమార్ ఉపాధ్యాయ వేసిన పిటిషన్‌ను తిరస్కరిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ అన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ నేతలు కోర్టుల్లో పిటిషన్‌లు వేయడం, ప్రజల మధ్య చిలీకలు తెస్తుండటం అన్యాయం అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

అందిన సాయం.. అన్నదాతకు ఆనందం

- రైతు భరోసా కింద 20,2596 మందికి రూ. 42.73 కోట్లు
- ఇన్‌పుట్ సబ్సిడీ కింద 838 మందికి రూ.75.75 లక్షలు
- కంప్యూటర్ బటన్ నొక్కి నిధులు విడుదల చేసిన సీఎం



రైతులకు అందజేసే మెగా చెక్కును ప్రదర్శిస్తున్న అధికారులు

కడప సిటీ: రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలుస్తోంది. రైతు సంక్షేమం కోసం ఎన్నో పథకాలు తీసుకొచ్చి ఆదుకుంటోంది. అందులో భాగంగా మంగళవారం రైతు భరోసా నిధులతోపాటు మాండూస్ తుపాను వల్ల దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు జిల్లా తెనాలిలో నిర్వహించిన బహిరంగ సభ అనంతరం కంప్యూటర్‌లో బటన్ నొక్కి సంబంధిత నిధుల విడుదలకు శ్రీకారం చుట్టారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రైతు భరోసా ఆఖరి విడత: ప్రతి రైతు కుంటుబానికి ఏటా రైతు భరోసా సాయం రూ.13,500 అందిస్తున్నారు. ఇలా వరుసగా నాలుగో ఏడాదికి సంబంధించి ఖరీఫ్ సాయంగా 2022 మేలో రూ.7500, రబీ సాయంగా అక్టోబర్‌లో రూ.4 వేలు చొప్పున జమ చేశారు. తాజాగా తుది విడతగా రూ.2 వేలు ఇచ్చారు. జిల్లాలోని బద్వేలు, జమ్మలమడుగు, కడప, కమలాపురం, ప్రొద్దుటూరు, మైదుకూరు, పులివెందుల, ఒంటిమిట్ట, సిద్దవటంలోని మొత్తం 202598 మంది రైతుల ఖాతాల్లో రూ.42.73 కోట్ల నిధులు జమ చేయడం జరిగింది.

మండూస్ తుపానుకు సంబంధించి

గతేడాది డిసెంబరులో మండూస్ తుపాను వల్ల జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. కలసపాడు, బద్వేలు, సిద్దవటం, బి.కోడూరు, కాశినాయన, చాపాడు, ప్రొద్దుటూరు, ఖాజీపేట, మైదుకూరు, సింహాద్రిపురం, అట్లూరు, చెన్నూరు మండలాల్లో పత్తి, వరి, మినుము, పెసలు, శనగ, జొన్నలు, మొక్కజొన్న, నువ్వుల పంటలు నాశనమయ్యాయి. 838 మంది రైతులకు 499.57 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లడంతో ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.75.75 లక్షలు ప్రభుత్వం విడుదల చేసింది.

కలెక్టరేట్‌లో అందజేత

జిల్లాలో లబ్ధిదారులైన రైతులకు రైతు భరోసాతోపాటు ఇన్‌పుట్ సబ్సిడీ నిధుల మెగా చెక్కును జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వర రావు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని కడపలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం సభా భవనంలో మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

కడప అగ్రికల్చర్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నదాతలకు అండగా ఉంటోందని రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మూడేళ్ల తొమ్మిది నెలల్లో రైతన్నలకు పలు పథకాల ద్వారా రూ.1,45,745 కోట్ల సాయం అందించినట్లు తెలిపారు.

నేటి నుంచి ట్రిపుల్ ఐటీలో ఇంటర్వ్యూలు

వేంపల్లె : మండలంలోని ఆర్జీయూకేటీ పరిధి ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో గెస్ట్ ఫ్యాకల్టీకి సంబంధించి బుధవారం నుంచి శుక్రవారం వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కె.సంధ్యారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 1న పీయూసీలోని బయాలజీ, తెలుగు, మాథమ్యాటిక్స్, ఇంగ్లిషు, 2న కెమిస్ట్రీ, సివిల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, 3న ఫిజిక్స్ సబ్జెక్టులకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆర్‌జియూకెటి.ఎసి.ఇన్ అనే వెబ్‌సైట్‌ను సంప్రదించాలని వివరించారు.

జిల్లా వ్యాప్తంగా 'ఆపరేషన్ ముస్కాన్'

- 44 మంది చిన్నారులకు విముక్తి
- జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్




జిల్లా ఎస్పీ అన్బురాజన్

కడప అర్బన్ : జిల్లా వ్యాప్తంగా 'ఆపరేషన్ ముస్కాన్' కార్యక్రమం నిర్వహించినట్లు ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. పోలీసులు ఐసీడీఎస్, రెవెన్యూ, వైద్యారోగ్య శాఖ, కార్మిక శాఖల సమన్వయంతో జిల్లా వ్యాప్తంగా రైల్వే స్టేషన్‌లు, బస్టాండ్‌లు, ఫుట్‌పాత్‌లు, హోటళ్లు, దాబాలు, ఆటోగ్యారేజ్‌లు, కుటీర పరిశ్రమలు, ఫ్యాక్టరీలలో మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాల కార్మికులుగా పని చేస్తున్న వీధి బాలలు, అనాథ బాలల కోసం సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 44 మంది చిన్నారులకు విముక్తి కల్పించడం జరిగిందన్నారు. ఇందులో ముగ్గురు బాలికలు ఉన్నారని పేర్కొన్నారు. వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి అప్పగించినట్లు వివరించారు. పిల్లలను కార్మికులుగా పనిలో పెట్టుకునే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఎన్నికల కోలాహలం

- తలపడుతున్న మజ్దూర్, ఎంప్లాయిస్ సంఘ్
- తొలివిడతలో 5న నందలూరులో పోలింగ్
- గుర్తులు కేటాయించిన రైల్వే పర్సనల్ అధికారులు



రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికల బ్యాలెట్ నమూనా

నందలూరు(రాజంపేట): సౌత్‌సెంట్రల్ రైల్వే పరిధి గుంతకల్ డివిజన్‌లో రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఎన్నికల కోలాహలం నెలకొంది. డివిజన్‌లో ఎనిమిది రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలకవర్గాలకు ఈనెల 15వతేదీలోపు ఎన్నికలు పూర్తి చేయాలని సౌత్‌సెంట్రల్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్(పీసీపీఓ) గుంతకల్ రైల్వేడివిజన్ సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ (డీపీఓ) చౌహాన్‌కు ఆదేశాలు జారీ చేశారు. గుంతకల్, గుత్తి , కడప, నందలూరు, రేణిగుంట, పాకాల, తిరుపతి, రాయచూరు రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలకవర్గాలను దక్కించుకునేందుకు డివిజన్, బ్రాంచి స్థాయిలో సౌత్‌సెంట్రల్ మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ సంఘ్‌లు తమ ప్యానెల్ తరపున అభ్యర్థులను ఎన్నికల బరిలోకి దింపాయి.

తొలివిడతలో నందలూరులో పోలింగ్..

రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలకవర్గ ఎన్నికలలో భాగంగా తొలివిడతగా నందలూరు రైల్వే కేంద్రంలో రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలకవర్గం ఎన్నికలకు పోలింగ్‌ను ఈనెల 5న నిర్వహించేందుకు డివిజన్ పర్సనల్ డిపార్టుమెంట్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కాగా ఇప్పటి వరకు నందలూరులో వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్లు కమలా మనోహర్, చెంచురెడ్డి ఆధ్వర్యంలో నామినేషన్ల వ్యవహారంతోపాటు గుర్తుల కేటాయింపు కార్యక్రమాలను చేపట్టారు.

ప్రచారంలోకి దిగిన యూనియన్, సంఘ్‌నేతలు

నందలూరులో మజ్దూర్ యూనియన్ తరపున సెక్రటరీగా పోటీ చేస్తున్న విశ్వనాథ్‌కు బస్సు గుర్తు, ఎంప్లాయిస్ సంఘ్ తరపున సెక్రటరీగా పోటీచేస్తున్న కృష్ణమూర్తికి పులిగుర్తును కేటాయించారు. ఇరుప్యానెళ్లలో జాయింట్ సెక్రటరీ, ట్రెజరర్‌తోపాటు డైరెక్టర్ల స్థానాలకు పోటీలో ఉన్న అభ్యర్థులకు వేర్వేరుగా గుర్తులు ఇచ్చారు. గతంలో కామన్ సింబల్‌తో ఎన్నికలు జరిగేవి. అయితే ఒక కార్మికసంఘం దీనిని వ్యతిరేకించింది. దీంతో సింబల్ వివాదం నెలకొంది. దీంతో ఈనెల 2న జరగాల్సిన ఎన్నికలను 5వ తేదీకి వాయిదా వేశారు. దీంతో తమ తమ ప్యానెల్‌ను గెలిపించుకునేందుకు మజ్దూర్ యూనియన్, సంఘ్ నేతలు ముమ్మర ప్రచారం చేపట్టాయి.

రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి


మాట్లాడుతున్న జడ్జి కవిత

కడప వైఎస్ఆర్ సర్కిల్ : వాహన దారులందరూ రోడ్డు భద్రతా నియమాలను తప్పని సరిగా పాటించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరి, జడ్జి ఎస్. కవిత పేర్కొన్నారు. మంగళవారం నగర శివార్లలోని ఊటుకూరు జిల్లా ఉప రవాణా శాఖ కార్యాలయంలో రోడ్డు భద్రత నియమాలపై డ్రైవర్లు, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్లు అయిన చిన్న పిల్లలకు ద్విచక్ర వాహనాలను ఇవ్వడం నేరమన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనం నడపరాదన్నారు. ఏదైనా రోడ్డు ప్రమాదంలో కుటుంబ యజమాని చనిపోతే ఆ కుటుంబం పరిస్థితి దయనీయంగా ఉంటుందన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలిస్తే వారికి కేంద్ర ప్రభుత్వం రూ. 5వేలు బహుమతిని అందజేస్తుందన్నారు. ఇందులో పోలీసు కేసులకు, కోర్టులకు తిరగాలనే అపోహను వీడాలన్నారు. డీటీసీ మీరా ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాలను పాటించి ప్రమాదాలను నివారించాలన్నారు. ఆర్టీసీ డ్రైవర్లు అనారోగ్యంతో ఉంటే బస్సులను నడపరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు శివప్రసాద్, విజయ్ భాస్కర్, ఏఎంవీఐ లక్ష్మీ ప్రసన్న సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నుంచి 130 కుటుంబాలు వైఎస్ఆర్‌సీపీలో చేరిక


టీడీపీ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : మండలంలోని యస్ పాలగిరి గ్రామంలో తెలుగుదేశం పార్టీకి చెందిన 130 కుటుంబాలు మంగళవారం రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు గజ్జల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. టీడీపీకి చెందిన నాగమునిరెడ్డి, మహేశ్వర్ రెడ్డి, విశ్వనాథరెడ్డి, పురుషోత్తంరెడ్డి, రమణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాజా రమేష్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రామచంద్రారెడ్డి, గంగాధర, మల్లయ్య, సుబ్బరాయుడు, గంగులయ్య, ప్రతాప్, జనార్దన వారి అనుచరులు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వీరందరికి రవీంద్రనాథ్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు సాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటేనే సాధ్యమవుతుందన్నారు. త్వరలో జరగబోవు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ బలపరుస్తున్న అభ్యర్థులను మంచి మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, మాజీ ఎంపీటీసీ చెంద్రాయుడు, స్థానిక నాయకులు శ్రీనివాసుల్‌రెడ్డి, నాగభూషణం, గురివిరెడ్డి, ప్రసాదురెడ్డి, ఓబులేసు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి మళ్లీ అధికారం తథ్యం

- ఎమ్మెల్సీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించండి
- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి


మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : రాబోయే సార్వత్రిక ఎన్నికలలో తిరిగి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం తథ్యమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక భాకరాపురంలోని వైఎస్సార్ ఆడిటోరియంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు ప్రతి సచివాలయం పరిధిలో ముగ్గురు కన్వీనర్లను, అదేవిధంగా ప్రతి వలంటీర్ క్లస్టర్ పరిధిలో ఇద్దరు గృహ సారథులను నియమించుకోవడం జరిగిందన్నారు. రాబోయే సంవత్సర కాలంలో కన్వీనర్లు, గృహ సారథుల ద్వారా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తెచ్చి మన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు.

- రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలలో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిలను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు తమ క్లస్టర్ పరిధిలోని పట్టభద్రులు, టీచర్లు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓట్లు వేసేలా అవగాహన కల్పించాలన్నారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో పార్టీ పూర్తి బాధ్యతతో వ్యవహరిస్తోందని.. వారికి ఏ సమస్యలున్నా పరిష్కరించేందుకు అందుబాటులో ఉంటామన్నారు.

మాట తప్పని.. మడమ తిప్పని కుటుంబం : ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి



మాట తప్పని.. మడమ తిప్పని కుటుంబం వైఎస్సార్ కుటుంబమని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25ఏళ్ల క్రితం తాను మంత్రిగా పులివెందుల ప్రాంతంలో పర్యటించినప్పుడు ఈ ప్రాంత రైతాంగం కరువు, కాటకాలతో అల్లాడిపోతుండేదన్నారు. రైతులు నీరు లేక తమ పంటలను కాపాడుకోలేక చాలా ఇబ్బందులు పడేవారన్నారు. అయితే మహానేత వైఎస్సార్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశారన్నారు. ప్రస్తుతం ఆయన తనయుడు కూడా పులివెందుల ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఏనాడూ ప్రత్యక్ష ఎన్నికలలో విజయం సాధించని నారా లోకేష్.. ముఖ్యమంత్రి జగన్ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గత టీడీపీ ప్రభుత్వం దివాలా తీసిందన్నారు. అయినా కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సవాల్‌గా తీసుకుని రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని పాలనను మన రాష్ట్రంలో మన ముఖ్యమంత్రి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

ధైర్యంగా ప్రజల వద్దకు వెళుతున్నాం.. : పోలా శ్రీనివాసులరెడ్డి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చడంవల్లే వైఎస్సార్‌సీపీ నాయకులు ధైర్యంగా ప్రజల వద్దకు వెళుతున్నామని పులివెందుల ఎన్నికల పరిశీలకుడు పోలా శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేసిన, చేస్తున్న పనులను తెలియజెప్పాలన్నారు. నేను మంచి చేస్తేనే నన్ను ఆశీర్వదించండి అని చెబుతున్న ఏకైక నాయకుడు భారతదేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే అని పేర్కొన్నారు.

- అనంతరం పులివెందుల మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, మండల పరిశీలకుడు బలరామిరెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి సోదరుడు రమాకాంత్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ గృహ సారథులు, కన్వీనర్ల బాధ్యతల గురించి తెలియజేశారు.
- అంతకుమునుపు వైఎస్సార్ విగ్రహానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఎం కార్యాలయ కో.ఆర్డినేటర్ జనార్దన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, వైఎస్సార్‌సీపీ నాయకులు హాలు గంగాధరరెడ్డి, పుష్పనాథరెడ్డి, సర్వోత్తమరెడ్డి, సుధీకర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మిమ్మలను విధుల్లో చేర్చుకోవడం లేదు

– సెల్‌ఫోన్‌కు సమాచారం పంపిన డీడీ

కడప అగ్రికల్చర్ : సరెండర్ చేసిన మిమ్మలను విధులలోకి చేర్చుకోవడం లేదంటూ కొందరు సిబ్బంది సెల్‌ఫోన్‌లకు డీడీ అచ్చన్న సమాచారం పంపినట్లు తెలిసింది. కాగా.. కడప బహుళార్థ పశువైద్యశాలలో (వీపీసీ) డీడీ అచ్చెన్నకు.. అందులో పనిచేసే ఏడీలు, డాక్టర్లకు మధ్య విభేదాలు ఉన్న విషయం తెలిసిందే. ఈ విబేధాల కారణంగా కొద్ది రోజుల నుంచి జేడీ కార్యాలయంలో ఉంటున్న ఏడీలు సుధీర్‌నాథ్ బెనర్జీ, శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ సుభాష్ చంద్రబోస్, అటెండర్లు నాగలక్ష్మి, రమేష్‌లను వీపీసీలో విధులు నిర్వహించాలని పశుసంవర్ధశాఖ డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు జిల్లా పశువైద్యాధికారి శారదమ్మ తెలిపారు. ఇటీవల నిర్వహించిన విచారణతోపాటు నిజ నిర్ధారణ కమిటీకి సంబంధించి నివేదికలు రావడానికి కొంత ఆలస్యం చోటు చేసుకోవడంతో వీరందరినీ విధుల్లో కొనసాగించాలని ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు. సంబంధిత ఉత్తర్వులను డీడీ అచ్చెన్నకు కూడా పంపినట్లు ఆమె తెలిపారు. తరువాత వారంతా వీపీసీకి వచ్చి విధుల్లో భాగంగా వైద్య సేవలను అందించారు. వీరు విధుల్లోకి వచ్చిన కొద్ది సేపటి తరువాత డీడీ అచ్చన్న.. సరెండర్ చేసిన మిమ్మలను విధుల్లో చేర్చుకోవడం లేదని వారి సెల్‌ఫోన్‌లకు సమాచారం పంపినట్లు తెలిసింది.

వైద్య సదుపాయాల మెరుగుకు రూపకల్పన

- జిల్లా కలెక్టర్ విజయరామరాజు
- అన్ని విభాగాల్లో వైద్య పరికరాల కోసం ప్రతిపాదనలు


కడప రిమ్స్‌లో హెచ్‌డీఎస్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వి. విజయరామరాజు

కడప అర్బన్ : జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న జిల్లా సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని హెచ్‌డీఎస్ చైర్మన్, కలెక్టర్ వి. విజయరామరాజు పేర్కొన్నారు. మంగళవారం రిమ్స్ ప్రభుత్వ వైద్య కళాశాల బోర్డు మీటింగ్ హాల్‌లో జిల్లా కలెక్టర్, జీజీహెచ్ హెచ్‌డీఎస్ చైర్మన్ వి.విజయరామరాజు అధ్యక్షతన 50వ ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్‌తో పాటు కడప నగర కమిషనర్ జి.ఎస్.ఎస్ ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి రాయలసీమ స్థాయిలో అత్యుత్తమ, మెరుగైన వైద్య సేవలు అందిస్తోందన్నారు. జీజీహెచ్ పరిధిలో ఇప్పటికే చాలా అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయని, అందులో భాగంగానే .. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, కేన్సర్ రీసెర్చ్ ఆసుపత్రి, నేత్ర వైద్యశాల, మానసిక వైద్యశాలలు అందుబాటులోకి రానున్నాయన్నారు. రాయలసీమలోనే అత్యాధునిక వైద్య సేవలు అందించే మెడికల్ హబ్‌గా వైఎస్ఆర్ జిల్లా జీజీహెచ్ విస్తృత సేవలు అందించనుందన్నారు. ఆసుపత్రిలో అన్ని విభాగాల వైద్యాధిపతులతో ప్రతి నెలా సమావేశం ఏర్పాటు చేసుకుని అవసరమైన వైద్య పరికరాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. అధునాతన వైద్య పరికరాలను నిర్లక్ష్యంగా ఉపయోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆరోగ్యశ్రీ శస్త్ర చికిత్సల సంఖ్యను పెంచాలన్నారు. రక్తనిధి కేంద్రంలో అన్ని గ్రూపుల రక్తాన్ని అందుబాటులో ఉంచాలన్నారు. జీహెచ్ఎం కళాశాల విద్యార్థుల కోసం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సహకారంతో క్రికెట్ స్టేడియంను కూడా ఏర్పాటు చేసేందుకు సంసిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం జీజీహెచ్‌లోని అన్ని విభాగాల వైద్యాధిపతులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వై శ్రీనివాసులు, ఏపీ ఎంఎస్ఐడీసీ ఈఈ ఏ. సురేంద్రనాథ్ రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ కె. నాగరాజు, ఏపీవీవీపీ డీసీహెచ్ఎస్ డాక్టర్ వైహిమదేవి, నర్సింగ్ సూపరింటెండెంట్ మాధురీలత, హెడీఎస్ సభ్యులు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ శ్రీధర్, శ్వేత, అన్ని విభాగాల వైద్యాధిపతులు పాల్గొన్నారు.

శిక్షణా కార్యక్రమాల పరిశీలన

పులివెందుల రూరల్ : పట్టణంలోని న్యాక్ శిక్షణా కేంద్రంలోని శిక్షణా కార్యక్రమాలను మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ విజయరామరాజు, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు శిక్షణా కార్యక్రమంలో భాగంగా ట్రైనీలతో శిక్షణ జరిగే విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన పులివెందుల మోడల్ టౌన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఆర్డీఓ వెంకటేశులు, తహసీల్దార్ మాధవ కృష్ణారెడ్డి, సాడాప్ జేడీఎం వేణు మాధవ్, ఏపీఎస్ ఎస్‌డీసీ మేనేజర్ నాగార్జున, న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ రాకేష్ పాల్గొన్నారు.

ఐటీఐ కళాశాల తనిఖీ

వేంపల్లె : స్థానిక పులివెందుల రోడ్డులో ఉన్న కందుల ఓబుళరెడ్డి ఐటీఐ కళాశాలను జిల్లా కలెక్టర్ విజయరామరాజు పరిశీలించారు. మంగళవారం కళాశాలలో విద్యార్థుల నమోదును ప్రిన్సిపల్ ప్రసాదరావును అడిగి తెలుసుకున్నారు.

వేముల : ప్రభుత్వ పాఠశాలలోని శిక్షణా కేంద్రాల ద్వారా విద్యార్థులు వృత్తి విద్యా కోర్సులలో నైపుణ్యత సాధించాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు సూచించారు. మంగళవారం స్థానిక వేముల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓ వెంకటేశులు, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, డీటీ త్రిభువన్‌రెడ్డి, ఐటీఐ ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

ప్రాధాన్యత రంగాలను మరింత పటిష్టం చేయండి

కడప సిటీ : అన్ని ప్రాధాన్యత రంగాలను ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా మరింత పటిష్టం చేసి జిల్లాను ప్రగతి పథంలో నడిపించాలని కలెక్టర్ విజయరామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీసీ హాలులో కలెక్టర్ అధ్యక్షతన అన్ని రకాల ప్రాధాన్యత రంగాలకు చెందిన జిల్లా అధికారులతో సమీక్ష జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు నిర్దేశించిన ఆయా రంగాలలో ఉన్న లక్ష్యాలను పనుల పురోగతి, సాధించిన ప్రగతి తదితర అంశాలపై మరింత ముందుకు వెళ్లాలన్నారు. వ్యవసాయంలో అధిక దిగుబడులు పెంచేలా సాగుబడి యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. ఈ–క్రాప్ బుకింగ్ చేయించాలన్నారు. ఉద్యానవన పంటల విస్తీర్ణాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పశువులకు వైద్యాన్ని మరింత విస్తృతం చేయాలన్నారు. రైతులకు సీజన్ల వారీగా ఎరువులు, పెస్టిసైడ్స్‌ను ఆర్బీకేల పరిధిలో అందుబాటులో ఉంచాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను చేపట్టాలన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా బ్యాంకు అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ జేడీలు నాగేశ్వరరావు, శారద, హార్టికల్చర్ డీడీ మైఖేల్‌రాజీవ్, పరిశ్రమలశాఖ జీఎం జయలక్ష్మి, బ్యాంకు, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

తెలుగు ఘనతను తెలిపిన జానమద్ది


మాట్లాడుతున్న మేడసాని మోహన్

కడప కల్చరల్ : తెలుగుభాషతోపాటు వేమనను విపరీతంగా ఇష్టపడిన సీపీ బ్రౌన్ కృషిని, ఆయన ద్వారా తెలుగుభాషను నేటి తరానికి అందించిన ఘనత సాహితీ తపస్వి డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రిదేనని ప్రముఖ అవధాని మేడసాని మోహన్ అన్నారు. మంగళవారం వైవీయూ ఆధ్వర్యంలో జానమద్ది 9వ వర్ధంతిని పురస్కరించుకుని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించిన సభకు ఆయన ప్రధాన వక్తగా హాజరై మాట్లాడారు. తెలుగుభాషను త్రికరణ శుద్ధిగా ఆరాధించిన జానమద్దిని యోగి పుంగవునిగా చెప్పవచ్చని మేడసాని మోహన్ అన్నారు. కవులు కళాకారులకు నిలయమైన ఈ జిల్లాలో నాటి సాహితీవేత్తల నుంచి సమకాలీన కవుల వరకు బ్రౌన్ శాస్త్రి నేటితరానికి తెలిపారన్నారు. సభాధ్యక్షులు, వైవీయూ వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జానమద్ది కృషితోనే బ్రౌన్ గ్రంథాలయం గొప్ప సాహితీ నిలయంగా విలసిల్లుతోందన్నారు. విశిష్ట అతిథి, శ్రీ అచలానంద ఆశ్రమం పీఠాధిపతి స్వామి విరజానంద మాట్లాడుతూ జానమద్ది తన గురువైన అచలానందస్వామికి సన్నిహితుడని, ఆ అనుబంధంతో ఆయన చేసిన ఎన్నో రచనలు ఆశ్రమం నడిపిన పత్రిక కాలజ్ఞాన సుధలో వచ్చాయన్నారు. మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ హనుమచ్ఛాస్త్రి బహుభాషా కోవిదుడని, ఆయనలో గొప్ప నటుడున్నాడని తెలిపారు. జానమద్ది కుమారుడు విజయభాస్కర్ మాట్లాడుతూ బ్రౌన్ గ్రంథాలయ నిర్మాణం కోసం తన తండ్రి పడిన కష్టాల గురించి, సహకరించిన అధికారుల గురించి తెలియజేశారు. జానమద్ది సన్నిహితులు, సాహితీవేత్త శింగల్‌రెడ్డి ఈశ్వర్‌రెడ్డి జానమద్దితో తనకుగల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా అతిథులను, బ్రౌన్ స్మారక ట్రస్టు సంయుక్త కార్యదర్శి మలిశెట్టి జానకిరామ్‌ను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో ఆచార్య నల్లపురెడ్డి ఈశ్వర్‌రెడ్డి, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

నిబద్ధతగల సాహితీ విమర్శకులు 'రా.రా'


రా.రా. చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అరసం ప్రతినిధులు

కడప కల్చరల్ : రాచమల్లు రామచంద్రారెడ్డి నిబద్ధతగల సాహితీ విమర్శకులని అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు ఆచార్య నల్లపురెడ్డి ఈశ్వర్‌రెడ్డి అన్నారు. ఆధునిక సాహితీ విమర్శకులు, అనువాదకులు రాచమల్లు రామచంద్రారెడ్డి (రా.రా.) 101వ జయంతి సభను మంగళవారం సాయంత్రం నగరంలోని రా.రా. గ్రంథాలయంలో అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన అరసం రాష్ట్ర అధ్యక్ష వర్గ సభ్యులు, జిల్లాశాఖ అధ్యక్షులు ఆచార్య నల్లపురెడ్డి ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రా.రా. ఆశయ సాధన కోసం అందరం కృషి చేయాలన్నారు. రా.రా. జీవితం–సాహితీ విమర్శ అంశంపై తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఎస్.విజయభాస్కర్ మాట్లాడుతూ మార్క్సిస్టు సిద్ధాంతాలు సమాజానికి ఉపయుక్తమని రా.రా. భావించారన్నారు. సమాజం–సాహిత్యం పాత్ర అంశంపై ప్రముఖ న్యాయవాది, రచయిత ఎస్.దాదాహయాత్ మాట్లాడుతూ సామాన్యుడిని చైతన్యం చేయడమే అభ్యుదయ సాహిత్యమన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.రామయ్య , అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ తుమ్మలూరు సురేష్‌బాబు, కార్యవర్గ సభ్యులు వి.గంగాసురేష్, అధ్యాపకులు హజరతయ్య మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు పి.చంద్రశేఖర్, రాష్ట్ర సమితి సభ్యులు పల్లవోలు రమణ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని నిర్మాణాలు, లే అవుట్లపై కొరడా

అనుడా వైస్ చైర్మన్ నందన్

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో ఎవరైనా అధికారుల అనుమతి లేకుండా నిర్మాణాలు, అక్రమ లే అవుట్లు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నమయ్య పట్టణాభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్ నందన్ హెచ్చరించారు. గ్రామ పంచాయతీల్లో భవన నిర్మాణ సంబంధిత ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ సెక్రటరీలకు ఏర్పాటుచేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. పంచాయతీల్లో 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణాలు చేపట్టాలనుకుంటే పంచాయతీ సెక్రటరీ అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. రాజకీయ బలంతో ఎవరైనా అక్రమ నిర్మాణాలు పూర్తి చేస్తే వారికి నేరుగా వెళ్లి నోటీసులు అందజేయాలన్నారు. స్థానికంగా ఒత్తిళ్లు ఉంటే కోర్టులో కేసు నమోదు చేయాలని సూచించారు. జిల్లాలోని అనధికార నిర్మాణాలు, లే అవుట్ల వివరాలు తమ వద్ద ఉన్నాయని, వారికి త్వరలో నోటీసులు జారీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, అర్బన్ హౌసింగ్ కింద స్వంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునే వారికి ఎలాంటి అనుమతులు అవసరం ఉండదని ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. ఈ సదస్సులో జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి, అసిస్టెంట్ ప్లానింగ్ అధికారులు కృష్ణ సింగ్, మహమ్మద్ ఆసిఫ్, శైలజ, డీఎల్‌పీఓ మస్తాన్ వలీ, ఏఓ ఖాదర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు వెండి కిరీటాలు సమర్పణ


వెండి కిరీటాలను అందజేస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో వెలసిన శ్రీ సీతారామలక్ష్మణ మూర్తులకు మంగళవారం మూడు వెండి కిరీటాలను సమర్పించారని ఆలయ డిప్యూటీ ఈవో నటేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా, రైల్వే కోడూరు మండలం, రాఘవ రాజపురం గ్రామానికి చెందిన రామిరెడ్డి సూర్యచంద్రారెడ్డి, సుగుణ దంపతులు ఈ వెండి కిరీటాలను బహూకరించారని, వీటి బరువు రెండు కిలోలు, విలువ సుమారు రెండు లక్షల వరకు ఉంటుందని చెప్పారు. ఈ కిరీటాలకు ఆలయ రంగమండపంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, రామయ్య సన్నిధిలో ఆలయ డిప్యూటీ ఈవో నటేష్ బాబుకు వారు అందజేశారు.

జిల్లాలో వాహనాల స్పెషల్ డ్రైవ్‌లో 243 కేసులు నమోదు

కడప అర్బన్ : జిల్లాలో పోలీసులు చేపట్టిన వాహనాల స్పెషల్ డ్రైవ్‌లో మంగళవారం నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపిన వారిపై మొత్తం 243 కేసులు నమోదు చేశారు. ఇందులో ప్రధానంగా హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలు నడిపిన వారిపై 225 కేసులు, సీటు బెల్ట్ ధరించకుండా వెళ్తున్న కార్లు, జీపులు తదితర వాహన చోదకులపై 18 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ అన్బురాజన్ తెలియజేశారు.

రాష్ట్రస్థాయి సైన్సు ఫెయిర్‌లో ప్రతిభ


బహుమతి అందుకుంటున్న జస్మిత

కడప ఎడ్యుకేషన్ : విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్సు ఫెయిర్‌లో ఏకో ఫ్రెండ్లీ మెటీరియల్స్ విభాగంలో సింహాద్రిపురం మండలం బలపనూరు జిల్లా పరిషత్తు పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న జి.హరిజస్మిత అనే విద్యార్థి మూడో బహుమతిని సాధించినట్లు జిల్లా సైన్సు అధికారి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. జాయింట్ కలెక్టర్ నూపూర్ అజయ్, విజయవాడ మేయర్ రాయన రాజ్యలక్ష్మి, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డిల చేతుల మీదుగా బహుమతిని అందుకుంది.

సాటుసారా ఊట స్వాధీనం

వేంపల్లె : మండలంలోని ముతుకూరు గ్రామ సమీపంలో మొగమూరు వంకలో 200లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. మంగళవారం సీఐ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు పోలీసు సిబ్బందితో కలిసి నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడులలో నాటుసారా ఊటను ధ్వంసం చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా నాటుసారా తయారీ చేసినా, విక్రయించినా వదిలే ప్రసక్తే లేదన్నారు. చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఈబీ కానిస్టేబుల్ రమణారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అరటిపంట దగ్ధం


ఆకులనారాయణపల్లెలో కాలిపోయిన అరటిపంట

కాశినాయన : మండలంలోని ఆకులనారాయణపల్లె గ్రామానికి చెందిన కాటాసుబ్బరాయుడు అనే రైతుకు చెందిన రెండు ఎకరాల్లోని అరటిపంట మంగళవారం కాలిపోయింది. రైతు తెలిపిన వివరాల మేరకు మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు ఒకదానికొకటి తగులుకుని మంటలు చెలరేగి రెండు ఎకరాల్లోని అరటిపంట, డ్రిప్ వైర్లు కాలిపోయాయని తెలిపారు. దాదాపు రూ.2 లక్షలు నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు. వెంటనే పోరుమామిళ్ల ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపుచేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరారు.